సాక్షి
వికారాబాద్
బుధవారం ၊ 20 ၊ మార్చి ၊ 2024



రైతు ఇంట పసిడి పంట

పసుపు పంట సాగు చేసిన రైతన్నలు ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



ప్రజా సంక్షేమం కోసమే..

ప్రజా సంక్షేమం కోసమే తాను బీఆర్‌ఎస్ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తెలిపారు. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
బుధవారం (సాయంత్రం)	గురువారం (ఉదయం)
6:33	4:58

న్యూస్‌రీల్

కూలీల సంఖ్య పెంచండి

కలెక్టర్ నారాయణరెడ్డి

అనంతగిరి: ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్యను పెంచి వంద శాతం పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని సూచించారు. గ్రామాల్లో ముళ్లపొదలను తొలగించడం, రోడ్లకు సంబంధించి భూమి చదును చేయడం వంటి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో పంచాయతీ సెక్రటరీలను భాగస్వాములు చేయాలన్నారు. జాబ్ కార్డు ఉన్న వారందరికీ పని కల్పించాలని ఆదేశించారు. గ్రామాల్లో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను మండల అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు.

పోరాట యోధురాలు మల్లుస్వరాజ్యం



నివాళి అర్పిస్తున్న నాయకులు

అనంతగిరి: తెలంగాణ పోరాట యోధురాలు, దివంగత మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనసూయ అన్నారు. మంగళవారం మల్లు స్వరాజ్యం వర్ధంతిని పురస్కరించుకుని వికారాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయుధ పోరాట ఫలితంగా తెలంగాణలో 10 లక్షల ఎకరాల భూములు పేదలకు పంచారని గుర్తు చేశారు. ఆమె తుది శ్వాస వరకు పీడిత వర్గాల కోసం పని చేశారని తెలిపారు. ఆమె పోరాట ఘట్టాలు ప్రజల మదిలో ఎప్పటికీ చెదిరిపోవన్నారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, అరవింద్, యుగేందర్, ముత్యం, శ్రావణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఖాళీల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టీఎస్ డబ్ల్యూఆర్‌ఎస్ అనంతగిరిపల్లి ప్రిన్సిపాల్ జేజే ప్రవీణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో రూ.100 రుసుం చెల్లించి ఈ నెల 23 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రంజాన్ ప్రార్థనలకు ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్యేను కోరిన ఈద్గా కమిటీ సభ్యులు



మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు

తాండూరు టౌన్: పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ప్రార్థనలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఈద్గా కమిటీ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన ఈద్గా వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. రంజాన్ ప్రార్థనలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈద్గా, మసీదుల వద్ద విద్యుత్, తాగునీరు, శుభ్రత వంటి అన్ని వసతులను కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, నాయకులు సర్దార్ ఖాన్, అజయ్ ప్రసాద్, హబీబ్ లాలా, ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 1న కౌలుకు వేలం

దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈఓ శ్రీనివాస్

షాబాద్: వేణుగోపాలస్వామి ఆలయ భూముల కౌలు కోసం వేలం నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయశాఖ ఈఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షాబాద్ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి భూముల కౌలు సందర్భంగా ఆసక్తి కలిగిన రైతులు ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 11 గంటలకు దేవస్థానం వద్ద నిర్వహించనున్న బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. ఈ భూములకు మూడు సంవత్సరాల కాల పరిమితి ఇవ్వనున్నట్లు ఈఓ పేర్కొన్నారు. ఈ వేలంలో గ్రామస్తులు, భక్తులు హాజరు కావలని ఆయన తెలిపారు.

మళ్లీ కదలిక

జెడ్పీ చైర్‌పర్సన్‌పై త్వరలో అవిశ్వాస సమావేశం

- కోర్టు ఆదేశాలతో ప్రారంభం కానున్న ప్రక్రియ
- గత నెలలో నోటీసు ఇచ్చిన బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు
- సమావేశం ఆలస్యం కావడంతో కోర్టు మెట్లెక్కిన సభ్యులు
- అప్పటి నుంచే పావులు కదుపుతున్న వైనం
- పంతం నెగ్గేందుకు విశ్వ ప్రయత్నాలు
- ఎవరి ధీమాలో వారు..
- ప్రక్రియ మొదలు పెట్టాం: కలెక్టర్



అడిషనల్ కలెక్టర్‌కు నోటీసు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, జెడ్పీటీసీలు (ఫైల్)

వికారాబాద్: జెడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే ప్రక్రియలో మళ్లీ కదలిక వచ్చింది. చైర్‌పర్సన్ సునీతారెడ్డిపై అవిశ్వాసం ప్రవేశ పెట్టాలని కోరుతూ జెడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్ నెల రోజుల క్రితం 12 మంది బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలతో కలసి జిల్లా అదనపు కలెక్టర్‌కు నోటీసు అందజేసిన విషయం తెలిసిందే. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే విషయంలో జాప్యం జరగటంతో రెండు వారాల క్రితం జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు కొప్పుల నాగిరెడ్డి పలువురు సభ్యులు కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి విన్నవించారు. బీఆర్‌ఎస్ తరఫున గెలిచి.. జెడ్పీ చైర్‌పర్సన్ బాధ్యతలు చేపట్టిన పట్నం సునీతారెడ్డి నెల రోజుల క్రితం పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఆ వెంటనే 12మంది జెడ్పీటీసీలు ఆమెపై అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. అయితే సమావేశం నిర్వహించకపోవడంతో కోర్టును ఆశ్రయించారు.

కోర్టు డైరెక్షన్‌తో..

అవిశ్వాసంపై ఎలా ముందుకెళ్లాలి అనే విషయంలో స్పష్టతలేక అధికారులు తేదీని ఖరారు చేయలేదు. ఈ ప్రక్రియ కలెక్టర్ పరిధిలో జరగాలా..? లేక జెడ్పీ సీఈఓ చేపట్టాలా..? అనేది సందేహంగా మారింది. దీంతో కలెక్టర్ నారాయణరెడ్డి ప్రభుత్వానికి లేఖ రాశారు. ఇటీవల ప్రభుత్వం కామన్ ఆర్డర్ ఇచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీపీ, జెడ్పీ చైర్‌పర్సన్లకు సంబంధించి అనేక చోట్ల అవిశ్వాసం నోటీసులు ప్రవేశ పెట్టిన నేపథ్యంలో అక్కడ అవలంబించిన విధానాలనే ఇక్కడ కూడా పాటించాలని సూచించింది. జెడ్పీ చైర్‌పర్సన్‌పై తాము పెట్టిన అవిశ్వాసంపై అధికారులు స్పందించేలా ఆదేశాలు ఇవ్వాలని బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన కోర్టు వారం రోజుల్లో ప్రక్రియను ప్రారంభించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. స్పందించిన కలెక్టర్ ఆ దిశగా చర్యలు చేపట్టారు. నోటీసులో జెడ్పీటీసీల సంతకాలే ఉన్నాయా..? ఎవరైనా ఫోర్జరీ చేశారా అనే విషయం తెలుసుకునేందుకు జెడ్పీ సీఈఓ సుధీర్‌కు లేఖ రాశారు.

ఎవరి ధీమా వారిదే

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బీఆర్‌ఎస్ వీడిన నాటి నుంచి ఆ పార్టీ నాయకులు ఆమెను పదవి నుంచి దింపడానికి పావులు కదుపుతూ వస్తున్నారు. జిల్లాలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లతో కలిపి 18 మంది సభ్యులు ఉన్నారు. అవిశ్వాసంపై నోటీసులు ఇవ్వాలంటే సాధారణ మెజార్టీ సభ్యులు ఉంటే సరిపోతుంది. 12 జెడ్పీటీసీలు అడిషనల్ కలెక్టర్ ముందే సంతకాలు చేసి ఆయనకు అందజేశారు. అవిశ్వాసం నెగ్గాలంటే టూ బై థర్డ్ మెజారిటీ అంటే 12 మంది జెడ్పీటీసీలు అవసరం అవుతారు. నోటీసులు ఇచ్చేందుకు వచ్చిన జెడ్పీటీసీలు అందరు ఇలాగే ఉంటే అవిశ్వాసం నెగ్గేందుకు వీలుంటుంది. అవిశ్వాసం వీగి పోవాలంటే జెడ్పీ చైర్‌పర్సన్‌తో కలిపి ఏడుగురు సభ్యులు ఉంటే సరిపోతుంది. అయితే తమకు పూర్తి బలం ఉన్నందున అవిశ్వాసం నెగ్గి తీరుతామని బీఆర్‌ఎస్ జెడ్పీటీసీలు పేర్కొంటుండగా తమకు సైతం సునీతారెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు.

“ కోర్టు డైరెక్షన్ ప్రకారం..



జెడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం విషయంలో కోర్టు డైరెక్షన్ ప్రకారం ముందుకు వెళతాం. నిబంధనల ప్రకారం ముందుకెళ్లాలని ప్రభుత్వం కూడా ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు వారం రోజుల్లో ప్రక్రియను ప్రారంభిస్తాం. నోటీసులు ఇచ్చిన సభ్యుల సంతకాలను స్క్రూటినీ చేయాలని జెడ్పీ సీఈఓను ఆదేశించాం. వారి నుంచి నివేదిక రాగానే కార్యాచరణ ప్రారంభిస్తాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్

గోమాత ఎంతో శ్రేష్ఠమైనది

- ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు
- ఘనంగా గోశాల దశాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న చాగంటి కోటేశ్వరరావు

తాండూరు టౌన్: గోమాత ఎంతో శ్రేష్ఠమైనదని, నిత్యం పూజ చేస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం తాండూరు ఆదర్శనగర్ పార్కులో గోశాల దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గోవు ఎంతో పవిత్రమైనదని అన్నారు. దాని శరీరం నుంచి వచ్చేది ఏదీ కూడా వ్యర్థం కాదన్నారు. గోమూత్రం, గోపేడలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ గోవులను పూజించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. హిందూ సంప్రదాయంలో గోవులకు ఎంతో ప్రాముఖ్యత ఉందని పేర్కొన్నారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనుల పరిశీలన



జినుగుర్తి అటవీ ప్రాంతంలో పర్యటిస్తున్న చంద్రకాంత్‌రెడ్డి తదితరులు

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి అటవీ ప్రాంతంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను మంగళవారం ఆ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ చంద్రకాంత్‌రెడ్డి బృందం పరిశీలించింది. అంతారం, జినుగుర్తి అటవీ ప్రాంతాల్లో పక్షుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేస్తున్న 22 నీటి కొలనులు, ప్లాంటేషన్, చెక్‌డ్యాంల నిర్మాణ పనులు, పార్కు లేషన్ ట్యాంకులు వంటి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తాండూరు రేంజ్ ఆఫీసర్ శ్యాంసుందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.



జర..జాగ్రత్త..


- కోడ్ ఉల్లంఘిస్తే కొరడా
- ఎన్నికల నియమావళిపై పటిష్ట నిఘా
- ఫ్లెక్సీలు, హోర్డింగులు, బ్యానర్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభం
- రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుపై ఆరా

వికారాబాద్: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పాలనా వ్యవహారమంతా అధికారుల చేతుల్లోకి వెళ్లింది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి అధికార యంత్రాగం సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా కోడ్‌ను పటిష్టంగా అమలు చేయడంపై నిమగ్నమైంది. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.. పలు ప్రభుత్వ శాఖల అధికారులు బాధ్యతలు అప్పగించారు. మారుమూల గ్రామాల్లో సైతం కోడ్ ఉల్లంఘన జరిగినా వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందజేయాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. పోలింగ్‌కు చాలా సమయం ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల వ్యయం, మద్యం, డబ్బు పంపిణీ తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచారు. సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలో వస్తున్న వార్తలు, కథనాలపై దృష్టి సారించారు.

నిబంధనలు ఇవే..

- కోడ్ అమల్లో ఉండటంతో రాజకీయ పార్టీలు ప్రజాసమస్యలపై ఆందోళనలు, పికెటింగ్‌లు, ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీల వంటివి నిర్వహించరాదు.
- ఓటర్లను ప్రలోభపెట్టే ప్రసంగాలు చేయరాదు
- ప్రార్థనా మందిరాలు, ఆలయాల వద్ద ప్రచారం నిర్వహించరాదు.
- ప్రభుత్వ వేతన పొందే కళాకారులు పార్టీల తరఫున ప్రచారం చేయరాదు.
- అధికారుల నుంచి అనుమతి పొందిన తరువాతే సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించుకోవాలి.
- ప్రచారానికి రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు వచ్చినప్పుడు ముందస్తు అనుమతి తీసుకోవాలి. రూట్ మ్యాప్ అందజేయాలి.
- ప్రభుత్వ ఉద్యోగులు ప్రచారంలో పాల్గొనరాదు
- ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకే ప్రచారం చేసుకోవాలి.
- అభ్యర్థి వెంట అనుమతి పొందిన వాహనాలు మాత్రమే తిరగాలి. కాన్వాయ్‌లో అనుమతి లేని వాహనాలు ఉంటే సీజ్ చేస్తారు.
- ప్రైవేటు స్థలాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే ముందుగానే పంచాయతీ, మున్సిపాలిటీ, సంబంధిత స్థలం యజమాని అనుమతి తీసుకోవాలి.
- ఓటర్లను ప్రలోభాలకు గురిచేయరాదు. మద్యం, డబ్బు, వస్తువుల పంపిణీ నేరం.
- అనుమతి లేకుండా హోర్డింగ్‌లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, డోర్, వాల్ పోస్టర్లను అంటించరాదు.
- ఒకే సమయంలో ఒకే చోట ఇరు పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రచారం చేయరాదు. ఎదురెదురుగా రాకూడదు.
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రచారం చేసుకోవాలి. ర్యాలీలు, సభలు, సమావేశాలను నిర్దేశిత గడువులోగానే ముగించాలి.

“ కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పార్టీలు, అభ్యర్థుల కదలికలు, వాహన శ్రేణి, ప్రచారానికి వినియోగిస్తున్న వాహనాలపై నిఘా ఉంచాం. కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. ఎన్నికల నిబంధనలను అభ్యర్థులు తప్పక పాటించాలి. జిల్లాలో వెయ్యి మంది పోలీసులు అందుబాటులో ఉన్నారు. ఇప్పటి వరకు రెండు కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా ఏడు చోట్ల ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. అవసరమైన చోట త్వరలో ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తాం. శాంతియుత ఎన్నికలకు అందరూ సహకరించాలి.

– కోటిరెడ్డి, ఎస్పీ

సెక్టోరల్ పాత్ర కీలకం

- అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి
- విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు
- రంగారెడ్డి కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో పరిస్థితులను ముందుగానే గమనిస్తూ, ఎప్పటికప్పుడు ఎన్నికల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. బాధ్యతాయుతంగా పని చేయాలని.. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో తాజా స్థితిగతులు.. గత ఎన్నికల్లో చోటు చేసుకున్న సంఘటనలు, వివిధ అంశాల ప్రాతిపదికన సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నిర్ణీత గడువులోపు పూర్తి వివరాలతో ప్రాథమిక నివేదికను సహాయ రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన మూడు రోజుల్లోపు తుది నివేదిక అందించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సంగీత, ఎంసీసీ నోడల్ అధికారి సౌమ్య, ఎన్నికల వ్యయం నోడల్ అధికారి సురేష్ మోహన్, ఏఆర్ఈఓలు, సెక్టోరల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేయాలి

నోడల్ అధికారులు బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో మంగళవారం నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, పరిగి, తాండూరు, వికారాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటి సర్వే నిర్వహించి 85 ఏళ్ల పైబడిన వారిని, దివ్యాంగులను గుర్తించాలని.. వారికి ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు కల్పించాలని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజులలోపు 12–డి ఫారం భర్తీ చేసి బీఎల్‌ఓలకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూసుకోవాలన్నారు. అంతర్ రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, వికారాబాద్ అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

మూడు దశాబ్దాలుగా | అలంకారప్రాయమే..!

- క్రయ విక్రయాలకు నోచుకోని కొడంగల్ మార్కెట్ యార్డు
- వినియోగంలో లేని దుకాణాలు
- దళారులకు పంట విక్రయించి నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కొడంగల్ మార్కెట్ యార్డు కార్యాలయం

కొడంగల్: రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన కొడంగల్ వ్యవసాయ మార్కెట్ యార్డు మూడు దశాబ్దాలుగా నిరుపయోగంగా ఉంది. యార్డు ప్రారంభం నాటి నుంచి క్రమ విక్రయాలు జరగడం లేదు. అప్పట్లో నిర్మించిన దుకాణలు వ్యాపారులకు అనుకూలంగా లేకపోవడంతో మార్కెట్ మూతపడింది. అయితే ఇటీవల కొత్తగా కొన్ని దుకాణాలు నిర్మించారు.వాటిని అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు పిలిచారు.ఒక్కో దుకాణానికి రూ.6 వేలకుపైగా ధర నిర్ణయించారు. వాటిని కూడా వ్యాపారులకు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారని విమర్శలువస్తున్నాయి.

30 ఏళ్లు దాటినా అదే గతి

కొడంగల్‌లో ఉప మార్కెట్ యార్డుకు 1994లో అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కొంతకాలం సజావుగా సాగినా ఆ తరువాత క్రయ విక్రయాలు ఆగిపోయాయి. అప్పటి నుంచి నేటి వరకు వ్యాపారం జరగడం లేదు. మార్కెట్ యార్డు ఏర్పడి సుమారు 30 ఏళ్లు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మార్కెట్ యార్డుకు మహర్దశ పడుతుందని రైతులు భావించారు. కానీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది.

30వేల హెక్టార్లలో పంటల సాగు

కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో సుమారు 30 వేల హెక్టార్లలో సాగు విస్తీర్ణం ఉంది. ఈ ప్రాంతాల్లోని రైతులు కంది, పత్తి, పెసర, మినుము, వరి పంటలు సాగు చేస్తుంటారు. పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోతున్నారు. ధరలో, తూకంలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఆరుగాలం కష్టించి పండిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని నల్లరేగడి భూముల్లో కంది పంట ఎక్కువగా పండుతోంది. ఇక్కడ పండించిన కందులకు తాండూరు, కర్నూల్, మహారాష్ట్రలో మంచి డిమాండ్ ఉంది. మార్కెట్ యార్డును తిరిగి ప్రారంభిస్తే మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు.

రూ.3 కోట్లతో గోదాం నిర్మాణం

స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రూ.3 కోట్ల వ్యయంతో గోదాం నిర్మించారు. ఈ గోదాంలో 5వేల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ఈ గోదాం రైతులకు అందుబాటులో ఉంది. ఈ ప్రాంతంలోని రైతులు కంది, పత్తి, వరి, పెసర, మినుము పంటలను అధికంగా పండిస్తున్నారు. గోదాంలో కందులు, రేషన్ బియ్యం నిల్వ చేయడం కోసం ఉపయోగిస్తున్నారు.

పాలక మండలి ఏర్పాటులో జాప్యం

కోస్గి మార్కెట్ యార్డు నుంచి కొడంగల్‌ను వేరు చేసిన తర్వాత మొదటిసారి ఎస్టీ మహిళకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కింది. బొంరాస్‌పేట మండలానికి చెందిన జ్యోతి రాథోడ్ చైర్‌పర్సన్‌గా చేశారు. ఆమె పదవీ కాలం ముగిసిన తర్వాత రెండో సారి జనరల్ మహిళకు కేటాయించారు. దౌల్తాబాద్ మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మోహన్‌రెడ్డి భార్య సుజాత చైర్ పర్సన్‌గా చేశారు. ఆమె పదవిలో ఉండగానే ప్రభుత్వం మారడంతో మార్కెట్ కమిటీ పాలకమండలి సభ్యులు రాజీనామా చేశారు. దీంతో మూడో సారి బీసీ జనరల్‌కు రిజర్వేషన్ వచ్చింది. మొదటి రెండు సార్లు బీఆర్‌ఎస్ చెందిన వారు చైర్ పర్సన్‌గా చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది కాబట్టి ఆ పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం కొడంగల్ మండల నాయకులు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మొదటి సారి బొంరాస్‌పేట, రెండో సారి దౌల్తాబాద్ నాయకులు చైర్మన్‌గా చేశారు. మూడో సారి కొడంగల్‌కు అవకాశం ఇవ్వాలని ఆశావహులు పార్టీ పెద్దలను కోరుతున్నారు.

క్లుప్తంగా

చింతచెట్టు పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం


నారాయణ మృతదేహం

పూడూరు: చింతపండు సేకరణకు వెళ్లిన వ్యక్తి చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. ఈ ఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని సిరిగాయపల్లి గ్రామానికి చెందిన అంబటి నారాయణ(53) పొలానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లాడు. మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామానికి చెందిన బ్యాగరి సుభాశ్‌కు చెందిన చింత చెట్టుకు ఉన్న చింత పండును రాల్చుతుండగా కొమ్మ జారి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డిగ్రీ విద్యార్హతతో ఉద్యోగావకాశాలు

దోమ: ప్రథం సంస్థలో పని చేయుటకు డిగ్రీ ఉత్తీర్ణుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ వెంకటయ్య, మండల కో ఆర్డినేటర్ మురళీకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని బాస్‌పల్లి, బొంపల్లి, ఊటుపల్లి, పరిగి మండల పరిధిలోని ఖుదావంద్‌పూర్, రంగంపల్లి గ్రామాల్లో కోఆర్డినేటర్‌గా పనిచేసేందుకు స్త్రీ, పురుషుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. కనీసం డిగ్రీ పూర్తి చేసి ఉండాలని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు 9000197110, 9985884640 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రాణం తీసిన ఓవర్‌టేక్

కర్ణాటక వాసి దుర్మరణం

పరిగి: ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయిన ఓ ద్విచక్ర వాహనదారుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గేట్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కల్బుర్గి జిల్లా యాద్గీర్ తాలూకా బాలసేడ్ గ్రామానికి చెందిన బాసప్ప బైక్‌పై హైదరాబాద్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బసప్ప తలకు తీవ్ర గాయాలవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కార్మికుల ముసుగులో గంజాయి అమ్మకం

కొత్తూరు: కార్మికుల ముసుగులో పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్ఓటీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానిక పోలీసులకు అప్పగించారు. కొత్తూరు పట్టణానికి చెందిన ప్రకాశ్(22) శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాళ్లగూడకు చెందిన వెంకటేష్(40)కు కొన్ని నెలలక్రితం పరిచయం ఏర్పడింది. ఇద్దరూ గంజాయి సేవిస్తుంటారు. ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకొచ్చి కొత్తూరులో విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు వారిపై నిఘాపెట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 320 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా! నా క్లయింట్ అయిన బీజెకె రామాచారి తండ్రి లక్ష్మణాచారి, వయసు సుమారు 50 సంవత్సరాలు, నివాసం: ఇంటి నంబరు 6-23/బి, దోమ గ్రామం మరియు మండలం, వికారాబాద్ జిల్లాకు చెందినవారికి గతంలో దోమ గ్రామం మరియు మండలం, వికారాబాద్ జిల్లాలో సర్వే నెంబర్ 35E మరియు 35F లో తన పేరున గల ప్లాట్ నెంబర్ 1, విస్తీర్ణం 2283 చదరపు అడుగులు లేదా 253.33 చదరపు గజాలు లేదా 211.78 చదరపు మీటర్లు, పరిగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అమ్మకం దస్తావేజు నెంబర్ 1223 తేది 21 మే 2010 డాక్యుమెంట్ కలిగి ఉండెను. పైన తెలుపబడిన డాక్యుమెంట్ తేది. 07-03-2024 రోజు ఉదయం 10.00 గంటల సమయంలో బీజెకె రామాచారి గారు దోమ నుండి పరిగికి వెళ్తున్న సమయంలో వుటుపల్లి గ్రామసమీపంలోకి రాగానే తన బ్యాగును చూసుకోనేసరికి బ్యాగు మరియు అందులో గల అమ్మకం దస్తావేజు డాక్యుమెంట్ నెంబర్ 1223 తేది 21 మే 2010 కనిపించలేదు, అవి వాహనం నుండి పడిపోయాయి మరియు అవేవీ గుర్తించబడలేదు. పైన పేర్కొన్న ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ పత్రాలను ఎవరైనా కలిగివున్నట్లయితే, వారు దానిని ఈ క్రింది చిరునామాకు ప్రచురించిన తేది నుంచి 7 రోజులలోపు అందజేయాలని విజ్ఞప్తి.

K. నరసింహారావు, న్యాయవాది
ఆఫీస్ హెచ్.నెం.10-116, బాలాజీనగర్ X రోడ్డు, పరిగి, వికారాబాద్ జిల్లా.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9550606222. [H-787738]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పసుపు రైతు ఇంట.. పసిడి పంట

పసుపు పంట రైతన్నకు సిరులు కురిపిస్తోంది. పన్నెండేళ్ల తర్వాత రికార్డు స్థాయి ధర పలుకుతోంది. దీంతో ఏళ్ల నుంచి నష్టాలు చవిచూసిన రైతులకు ఈ ఏడాది దండిగా లాభాలు తెచ్చిపెడుతోంది.

పుష్కర కాలం తర్వాత పెరిగిన మద్దతు ధర

- వికారాబాద్ మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.15వేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


నాగులపల్లిలో ఉడకబెట్టేందుకు సిద్ధం చేసిన పచ్చి పసుపు

పెద్దేముల్: పసుపు సాగు చేసిన రైతన్నలు ఈ ఏడాది ధరలతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడాది పాటు చేసిన కష్టానికి ఫలితం దక్కిందని సంబురపడుతున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 2009లో రూ.16వేలు ధర పలికింది. అప్పటి నుంచి ఆశతో సాగు చేసిన అన్నదాతకు కష్టాలు తప్పలేదు. ఆరు నెలల పాటు పంట నిల్వ చేసినా గిట్టుబాటు ధర లేక ఫలితం దక్కలేదు. కనీస ధర రూ.6వేలు మించలేదు.

దుంపకుళ్లుతో తగ్గిన దిగుబడి

మండల పరిధిలోని నాగులపల్లి, హన్మాపూర్, రుద్రారం, గోపాల్‌పూర్, ఇందూరు, ఆత్కూర్, తింసాన్‌పల్లి, నర్సపూర్, గిర్మాపూర్‌తో పాటు పలు గ్రామాలల్లో రైతులు పసుపు పంటను సాగుచేస్తున్నారు. కోట్‌పల్లి మండలం అన్నసాగర్, పెద్దేముల్ మండల నాగులపల్లి గ్రామాలు పసుపు సాగుకు పెట్టింది పేరు. ఈ రెండు మండలాల్లో సుమారు 500ఎకరాలకు పైగా పసుపు పంటను సాగుచేస్తున్నారు. నాగులపల్లి గ్రామంలో సాగు నీరు ఉన్న ప్రతీ రైతు సుమారు 20 గుంటల నుంచి రెండు ఎకరాల వరకు పసుపు సాగుకు మెగ్గు చూపుతున్నారు. వానకాలం ప్రారంభంలో పంట విత్తితే ఫిబ్రవరి, మార్చి వరకు పంట చేతికి వస్తుంది. గత వారం వికారాబాద్ మార్కెట్లో రూ.15వేల నుండి రూ.15,600లు ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పసుపు పంటకు ధర వచ్చిందని రైతులు చర్చించుకుంటున్నారు. మూడేళ్లుగా క్వింటాల్‌కు రూ.5వేల నుంచి రూ.6వేల ధర మాత్రమే ఉండడంతో రైతన్నలు నిరాశకు గురయ్యారు. నెల కోసారి పంట తనిఖీ చేసి సూచనలివ్వాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రెండేళ్లుగా పంటకు దుంపకుళ్లు రోగం సోకడంతో పంట దిగుబడి తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు రూ.65వేల ఖర్చు

ఎకరా పొలంలో పసుపు సాగుకు సుమారు రూ.65వేల ఖర్చు వస్తుంది. కలుపు తీత, ఎరువులు వేయటం మరో రూ.20వేల వరకు ఖర్చు అదనం. ఎకరాకు సుమారు 20 నుంచి 25 క్వింటాల్ దిగుబడి వస్తేనే లాభదాయకం. దీంతో పాటుగా ధర ఆశాజనకంగా ఉంటేనే అన్నదాత పంటసాగుకు ఆసక్తి చూపుతారు.

అధిక దిగుబడి

పత్తి, కంది పంటలతో పోలిస్తే పసుపు పంటకు దిగుబడి అధికం. లాగోడి ఎక్కువైన ధర అనుకూలిస్తే లాభం ఉంటుంది. ఎకరా పొలంలో పంటను సాగుచేయాలన్నా, నాలుగు పుట్లు (ఎనమిది) క్వింటాళ్ల విత్తనం అవసరం. నాలుగైదు తడులు నీరుపెడితే పంట చేతికి వస్తుంది. ఇక్కడ కోడి ఎరువు అందుబాటులో లేక శంషాబాద్, షాబాద్, పటాన్ చెరువు నుంచి తీసుకువచ్చి పంట సాగుచేస్తున్నారు.

ఇరవై ఏళ్లుగా సాగు



20 ఏళ్ల నుంచి పసుపు సాగు చేస్తున్నా. మద్దతు ధర లేక పోవడంతో మూడేళ్లుగా 20 గుంటలకు పరిమితం చేశా. ఇది లాభదాయకమైన పంట. అనుకూలమైన ధరలు వస్తే ఏడాదిలతో లక్షాధికారి కావచ్చు. మద్దతు ధర వస్తే రైతులు సాగుకు ఆసక్తి చూపుతారు.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, నాగులపల్లి

మార్కెట్ ఏర్పాటు చేయాలి



పంట విక్రయానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ మార్కెట్‌కు వెళ్లాలి. తాండూరు మార్కెట్‌లో ఏర్పాటు చేయాలని పదేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నాం. ట్రాన్స్‌పోర్ట్ ధరలు తగ్గితే రైతుకు భారం తగ్గుతుంది. మద్దతు ధరతో పాటుగా మార్కెట్ సాకర్యం కల్పించాలి.

– అంజిల్‌రెడ్డి, రైతు, రుద్రారం

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం


నాగలక్ష్మి (ఫైల్)

పరిగి: యువతి అదృశ్యమైన సంఘటన పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. ఎస్ఐ సంతోశ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కళ్లాపూర్ గ్రామానికి చెందిన కర్రల ఇంద్రమ్మ, సత్తయ్య దంపతుల కూతురు నాగలక్ష్మి డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. రోజు మాదిరిగానే ఈ నెల 18న కళాశాలకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల వద్ద, స్నేహితుల వద్ద ఎంత వెతికిన ఆచూకీ లభించలేదు. మంగళవారం యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోట్‌పల్లి ఠాణా పరిధిలో వ్యక్తి


వెంకటేశం (ఫైల్)

బంట్వారం: నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ ఘటన కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ అంబదాస్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల వెంకటేశం (57) ఈ నెల 16న ఇంట్లో నుంచి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల దగ్గర, సమీప ప్రాంతంలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ మేరకు వారు మంగళవారం కోట్‌పల్లి ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గర్భిణులు ఒత్తిడికి లోనవ్వొద్దు


హాజరైన గర్భిణులు, అంగన్‌వాడీ టీచర్లు


మాట్లాడుతున్న డాక్టర్ అనుపమ

డాక్టర్ అనుపమ

తాండూరు టౌన్: గర్భిణులు ప్రశాంతంగా ఉనప్పుడే శిశువు ఎదుగుదల సక్రమంగా ఉంటుందని డాక్టర్ అనుపమ అన్నారు. మంగళవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో ఆర్యజనని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని సుమారు 250 మంది గర్భిణులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. పిండం గర్భంలో ఎదుగుతున్న సమయంలో తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిండం ఎదుగుదలపై డిజిటల్ విధానంలో అందరికీ అవగాహన కల్పించారు. గర్భిణులు ఒత్తిడికి లోనవ్వకుండా యోగా, ధ్యానం, భజన, ఇతిహాసాల పఠనం, సమతుల్య పౌష్టికాహారం తీసుకుంటే శిశువు ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. సెల్‌ఫోన్స్, ఆల్కహాల్, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. శిశువు జన్మించిన గంటలోపు తల్లి పాలు పట్టించాలన్నారు. అనంతరం న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కొట్రిక విజయలక్ష్మి, డాక్టర్ సంపత్ కుమార్, శారద, డాక్టర్ రాజశేఖర్, రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు బాలకృష్ణ, బసనప్ప, దశరథ్, వెంకట్, నరహరి, మోహన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గంగాధర్, శరణు, లక్ష్మి, దీప్తి, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజలు

తాండూరు టౌన్: తాండూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని విఘ్నేశ్వర కాలనీ వాసులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే 11వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డు వాసులు కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ పరిధిలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. తాగునీటి సరఫరా, సీసీ రోడ్లు, మురుగు కాలువ నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు తదితర సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నీరజాబాల్ రెడ్డి, వేణుగోపాల్, హబీబ్‌లాలా, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే పార్టీ మార్పు

- కాంగ్రెస్ అధిష్టానం ఆదేశిస్తే బరిలో ఉంటా
- చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

పరిగి: ప్రజా సంక్షేమం కోసమే తాను పార్టీ మారానని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మారుతున్న రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా తాను కాంగ్రెస్‌లో చేరానన్నారు. చేవెళ్ల అభివృద్ధికి తాను ఎంతో శ్రమించానన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎన్నో గ్రామాలు అభివృద్ధి చేయాల్సి ఉందని.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కలిసికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధ్యమన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే తనను ఎంపీ ఎన్నికల బరిలో ఉంటానన్నారు.

ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర: ఎమ్మెల్యే టీఆర్ఆర్

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు బీఆర్ఎస్, బీజేపీలు కుట్ర పన్నుతున్నాయన్నారు. ఇతర పార్టీల నుంచి చేరేందుకు క్యూ కడుతున్న వివాదరహితులనే పార్టీలోకి ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కాంగ్రెస్‌కు పట్టం కట్టారని.. ఒక్కొక్కటిగా ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కార్పొరేషన్‌ల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశామన్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ హయంలో పూర్తి చేసి జిల్లా ప్రజలకు సాగునీటిని అందిస్తామన్నారు. జిల్లాను పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు ఉపాధిని తప్పకుండా కల్పిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, కద్మూర్ ఆనందం, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చందర్, ఆయా మండలాల అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్, సీనియర్ నాయకులు గోపాల్, యాదయ్య, బంగ్ల యాదయ్య, శ్రీనివాస్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఏనుగు దిగి హస్తం గూటికి

ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఎస్పీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తలారి రాజు, వంద మందికిపైగా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రభుత్వ సంక్షేమపథకాలకు ఆకర్శితులమై పార్టీలో చేరుతున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజా సంక్షేమ పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు.

ఎంపీకి సన్మానం

కుల్కచర్ల: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఎంపీ రంజిత్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. పార్లమెంట్ అభివృద్ధి కోసం పార్టీలో చేరడం సంతోషాన్నిచ్చిందన్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. అభివృద్ధిలో తన భాగస్వామ్యం కోసమే కాంగ్రెస్‌లో చేరానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు


సుదర్శన యాగంలో ఎమ్మెల్యే టీఆర్ఆర్ దంపతులు

పరిగి: పట్టణ కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి 37వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం చేపట్టిన సుదర్శన యాగంలో ఎమ్మెల్యే టీఆర్ఆర్ దంపతులు, ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెళ్లయిన మూడు రోజులకే..

- రోడ్డు ప్రమాదం
- చికిత్స పొందుతున్న వరుడి మృతి


ప్రవీణ్‌కుమార్(ఫైల్)

షాబాద్: పెళ్లయిన మూడు రోజులకే వరుడి కుటుంబంలో విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంతో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృత్యువాత పడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం .. గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్(25)కు అదే గ్రామానికి చెందిన యువతితో ఈ నెల 13న వివాహమైంది. 16న తన స్కూటీపై బావమరిది, కేతిరెడ్డిపల్లికి చెందిన సూర్యను హైతాబాద్‌లో దింపేందుకు.. కార్వాన్‌కు చెందిన మరో బావమరిది సూర్యతో కలిసి వెళ్లాడు. హైతాబాద్‌లో సూర్యను దింపి వస్తుండగా అంతిరెడ్డిగూడ వద్ద వాహనం అదుపు తప్పి ప్రీకాస్ట్ ప్రహరీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కార్వాన్‌కు చెందిన సూర్య స్వల్పంగా గాయపడగా ప్రవీణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతనికి శంషాబాద్‌లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వరుడు మంగళవారం మృతి చెందాడు. మృతుడి బాబాయి శివరాజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కర్మకాండకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

- 16 తులాల బంగారం, రూ. 2లక్షల నగదు అపహరణ


దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: కర్మఖాండకు వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్లా చేశారు. ఇంటి తాళాలు పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా, పెద్దఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన గంజి యాదగిరి ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో బొంగ్లూర్‌లోని రాఘవేంద్రహోమ్స్‌లో నివాసం ఉంటూ హాస్టల్స్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7వ తేదీన గంజి యాదగిరి తల్లి సత్తమ్మ మృతి చెందడంతో పెద్ద కర్మ జరిపే నిమిత్తం 16వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. 18వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు ఇంటికి వచ్చి చూడగా మెయిన్‌డోర్ తాళం విరగొట్టి ఉండటం గమనించాడు. లోపలికి వెళ్లి చూసేసరికి బీరువా పగలగొట్టి ఉంది. బంగారు ఆభరణాలు సుమారు 16 తులాల వరకూ, రూ.2 లక్షలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు తెలిపాడు. యాదగిరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగకు రిమాండ్


బైక్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కుల్కచర్ల: ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. ఈ ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అన్వేశ్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కూర శేఖర్ పది రోజుల క్రితం తన ఇంటి ఎదుట బైక్‌ను పార్క్ చేశాడు. చౌడాపూర్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన బంక యాదయ్య షాప్ వచ్చి బైక్‌ను దొంగిలించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీసీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు నిందితుడిని గుర్తించారు. ఆయన హైదరాబాద్‌లో నివసిస్తుండడంతో అక్కడకు వచ్చి బైక్ మరియు నిందితుడిని ఠాణాకు తీసుకువచ్చారు. యాదయ్యపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బెల్ట్‌షాప్‌పై పోలీసుల దాడి

మద్యం బాటిళ్లు స్వాధీనం

చేవెళ్ల: బెల్ట్‌షాప్‌పై దాడి చేసిన పోలీసులు 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అమ్ముతున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన శంకర్‌పల్లి మండలం లక్ష్మారెడ్డిగూడలో చోటు చేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం.. గ్రామానికి గోపాల్‌గౌడ్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడులు నిర్వహించగా 30 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వాటిని సీజ్ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపనోత్సవాలు

హాజరైన సినీనటుడు సుమన్

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి సమీపంలో కొర్పోలు లీలాలక్ష్మారెడ్డి దంపతుల సహకారంతో నిర్మించిన నూతన ఆలయాల్లో విగ్రహప్రతిష్ఠాపన పూజలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సినీ నటుడు సుమన్, ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సిటీ సీఎండీ శేషగిరిరావు, ఈడీ రమేశ్, మహేశ్వర మహాపిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవీందర్, శ్రీరామేశ్వర వీరాంజనేయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణాలతో గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అతిథులను ఘనంగా సన్మానించారు. ప్రతిష్ఠాపన ఉత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, సుధీర్‌రెడ్డి, పాపిరెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్, రాజు, జగన్, కేశవులు, రామకృష్ణ, నర్సింహ, పర్వతాలు, కృష్ణయ్య, శ్రీరాములుగౌడ్, నిరంజన్, యాదయ్య, వెంకటేశ్, కుమార్, రజనీకాంత్ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి: సుమన్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సినీ నటుడు సుమన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలో అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలో కౌన్సిల్‌ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎర్త్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ.. పర్యావరణంపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఎర్త్ సెంటర్‌లో విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ సేవలను ప్రశంసించారు అనంతరం ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై సిటీ సీఎండీ శేషగిరిరావు మాట్లాడుతూ.. సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో 12 లక్షల మంది విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లో 36 లక్షల మొక్కలను సంరక్షించడం ప్రశంసనీయమన్నారు. అనంతరం సీజీఆర్ చైర్ పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి సినీ నటుడు సుమన్‌కు మొక్కతో పాటు, ఈస్టర్న్ ఘాట్స్ ఎన్విరాన్‌మెంట్ ఔట్ లుక్ పుస్తకాన్ని అందజేశారు.


విగ్రహాలకు జలాధివాస పూజలు నిర్వహిస్తున్న పండితులు